



# అంతా తెలిసే...

పాలగుమ్మి రామకృష్ణారావు

**రైలు ప్రయాణంలో ఎన్నో సరదాలు, సంతోషాలతో పాటు మరచిపోలేని సంఘటనలు కూడా వుంటాయి. రైలు ప్రయాణంపై ఇద్దరు రచయితలు రాసిన కథలు చదవండి**

**ఝూ**లు విదిలించి గర్జించి అడుగు వేసిన సింహంలా ఫలక్‌నుమా హారన్ మోగింది. ముందుకు కదిలింది సికింద్రాబాద్ స్టేషన్‌లో. స్టేషన్ షెడ్లలోని చీకటి వెలుగులను తప్పించుకుంటూ కంపార్ట్‌మెంట్ల నిండా పూర్తి వెలుగును నింపుకుని బయటపడ్డాయి బోగీలు. ప్లాట్‌ఫారంపై రణగొణ ధ్వని దూరమయింది. అప్పటివరకు సామానులు సర్దుకుంటూ, వీడ్కోలు చెప్పుకోటానికొచ్చిన బంధుమిత్రులకు చేతులూపుతూ హడావిడిగా ఉన్న ప్రయాణీకులు స్థిమితంగా ఒకరి మొహాలు ఒకరు పలకరింపుగా చూసుకుంటున్నారు. ఇప్పటి నుండి బంధువులం, మిత్రులం అన్నీ మనమే అన్న భావనతో.

ఆ ప్రశాంతతను పది నిముషాల్లోనే భగ్నం చేస్తూ ''ఏడు కొండల వాడా'' అంటూ ఇద్దరు గుడ్డివాళ్ళు అడుక్కుంటూ ఒక ప్రక్కనుంచి ''చాయ్..చాయ్'' అంటూ మరొకరు టీకేన్‌తో




రెండో ప్రక్కనుండి వస్తున్నారు. చిరిగిన బట్టలతో ఉన్న కుంటి కుర్రాడు కాళ్ళీడ్చుకుంటూ వచ్చి కంపార్ట్‌మెంట్ శుభ్రం చేస్తూ ధర్మం చెయ్యమని చేయి చాస్తున్నాడు.

"ఎక్స్‌ప్రెస్‌లయినా, నాన్ స్టాప్‌లయినా వీళ్ళ బాధ మనకు తప్పదు" అన్నాడు ఎదుటి సీటులో కూర్చున్న మధ్య వయస్కుడు. రైల్వే కంపార్ట్‌మెంట్లలో సంభాషణల నాందికి ఇదొక రకమయిన దారి. అక్కడినుంచి అందరి మధ్య సంభాషణలు పాత్రోచితంగా నడుస్తుంటాయి. ముష్టివాళ్ళ బాధ మీద అరగంట కాలం అలవోకగా గడిచిపోయింది. యించుమించు అందరం తలోమాటా పాలు పంచుకున్నాం, ఒక వ్యక్తి తప్ప.

ఆయన దీక్షగా పుస్తకం చదువుతున్నాడు. గడ్డం, తల జుట్టు పెంచి, నుదుటన కుంకుమ బొట్టుతో ఉన్నాడాయన. ఆయన చేతి వేళ్ళ మధ్యనుండి పుస్తకం అట్టపై శీర్షికను తెలుసుకోడానికి ప్రయత్నించాను. 'హస్త సాముద్రికం' అని అర్థమయింది.

"మీకు చేయి చూడడం వచ్చా?" అన్నాను పరిచయంగా.

ఆయన చిరునవ్వు నవ్వాడు. "ఏదో తెలుసుకోవాలన్న తపన" ఆ మాటన్న తరువాత మళ్ళీ పుస్తకంలోకి వెళ్ళిపోయాడు.

మాకు వెనుక వరుసలో వున్న శాస్త్రిగారు ఇంకా సామానులు లెక్క పెట్టుకుంటూనే వున్నారు. ఒక వస్తువు లెక్కకు రావడం లేదు. శాస్త్రిగారు భార్యా పిల్లలపై అరుస్తున్నారు.

"మేం సరిగ్గానే బండెక్కించాం. ఇంతలో ఏ దొంగవెధవ కాజేశాడో?" అంది కళ్ళనీళ్ళతో ఆమె.

"ఏం పోయిందండి?" అన్నాడు జంతికలు అమ్ముకునే వాడు అటుగా వచ్చి.

శాస్త్రిగారికి చిర్రెత్తుకొచ్చింది.

"ముక్కుపొడుం డబ్బా" అన్నారు కోపంగా.

అందరు ముసి ముసిగా నవ్వుకుని తమాయించుకుని జాలిపడ్డారు.

పోయిన వస్తువు రాగి చెంబు.

"రాగి చెంబా!"

"అయితేనేం. అదేమన్నా ఉచితంగా వస్తుందా?"

శాస్త్రిగారి కోపానికి నోళ్ళు మూతపడ్డాయి. అది దూర ప్రయాణం. ప్రయాణీకుల బంధం ఆ ఒక్క గదిలోనే చాలా గంటలు ఉంటుంది. అలాంటప్పుడు దెబ్బలాటకంటే స్నేహానికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ప్రయాణీకులు అందరూ వాళ్ళ సామాన్లని కూడా సరి చూసుకున్నారు. రాగిచెంబు పొరపాటున కలిసిందేమోనని. దొరకలేదు. అయితేనేం, ఇప్పుడు కాలక్షేపానికి చాలా విషయాలు ముందుకు వచ్చాయి.

శాస్త్రిగారు మొదలు పెట్టారు. "ఈరోజుల్లో ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో అర్థం కావడం లేదు. ప్రతివాడూ మోసమే. ఆటో ఎక్కేటప్పుడు ఒక మాట, దిగేటప్పుడు ఒకమాట. లగేజీ అదనం అని ఇరవై రూపాయలు ఎక్కువ తీసుకున్నాడు ఆ కుంక. నాకనుమానం, వాడే కాజేసుంటాడు"

"మీరు వాడిని నమ్మారు. మీ నమ్మకాన్ని వాడు సొమ్ము చేసుకున్నాడు"

"అది సరేనండి, మనల్ని నమ్మించి మోసం చేసేవాళ్ళు ఎంతమంది లేరు?" నల్లకళ్ళద్దాలాయన అందుకున్నాడు.

"మొన్నీ మధ్యన మా ఊళ్ళో ఏం జరిగిందనుకున్నారు? ఒక పెద్దమనిషి బ్యాంకునుండి డబ్బు తీసుకుని వస్తున్నాడు. ఎవరో "పదిరూపాయల నోట్లు పడిపోయాయి, మీవేనాండి" అన్నారు. పాపం అవుననుకుని కిందకు వంగి ఏరుకుంటున్నాడు. ఇంతలో చంకలో బ్యాగ్ మాయం చేశారు"

"ఇవన్నీ మామూలేనండి. బ్యాంకుల దగ్గర నిత్యం జరిగేవే. కళ్ళలో కారం కొట్టో, వంటికి మట్టి రాసో ఏదోరకంగా మనల్ని ఇబ్బంది పెట్టి డబ్బు దొంగిలించడం జరుగుతోంది. ఇలా జరుగుతోందని తెలుసుండి మళ్ళీ మళ్ళీ మనం మోసపోతున్నాం"

నాకు నవ్వు వచ్చింది. శాస్త్రిగారు ఎక్కడో జారవిడిచిన రాగి చెంబు సంబంధం లేని విషయాలకు మార్గం అయింది. కంపార్టుమెంటులో పోటీపడి వాళ్ళ వాళ్ళ అనుభవాలు చెప్పుకు పోతున్నారు. విషయ పరిజ్ఞానం ఎవరికి ఎక్కువ ఉందో నిరూపించుకోవాలన్న పోటీ వాళ్ళలో పెరిగిందనిపించింది. కాలంతో పరుగులు తీస్తోన్న రైలుకు కబుర్లు ఇంధనం అయ్యాయి.

నల్లకళ్ళజోడాయాన మూడు ముక్కలాటలో జరిగే మోసాలను వివరించాడు. శాస్త్రిగారుకూడా కూరల మార్కెట్లలో తక్కెడల మాయాజాలాలు చెప్పారు. ఒక వయసులో ఉన్న కుర్రాడు బట్టల మార్కెట్లలో రేట్ల రహస్యాలను విప్పాడు.

మరో తల నెరిసినాయన ఆయన అనుభవాన్ని వివరించాడు. "ఒకసారి నేను విజయవాడలో కాళేశ్వర్రావు మార్కెట్టుకు వెళుతోంటే, రోడ్డుమీద పెద్ద బంగారపు కణిక ధగధగ మెరుస్తూకనపబడింది. ఒక్కసారిగా ఆగాను, నావెనకాల వాడెవడో ఒక్క ఉదుటున ముందుకు వచ్చి దాన్ని తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. సరేలే, మనకు ప్రాప్తం లేదనుకుని వెళ్ళబోతోంటే, వాడే నన్ను ఆపి "సార్ దీన్ని మనం ఇద్దరమే చూసాం. ఎవరికీ చెప్పకండి. చెరిసగం తీసుకుందాం" అన్నాడు.

వాడే అన్నాడు కదా అని 'సరే' అన్నాను.

"కంసాలి దగ్గరికి పోదాం పదండి" అన్నాడు.

నాలుగు అడుగులు వేశామో లేదో "సార్ మూడో వ్యక్తికి తెలిస్తే గొడవ అవుతుందేమో" అన్నాడు సందేహంగా.

"ఏం చేద్దాం?" అన్నాను.

"ఇది పది తులాలు వుంటుంది. ఎంత లేదన్నా యాభై వేలు. ఇది మీరుంచుకుని ఎంతోకొంత నాకివ్వండి. దీన్ని ముక్కలు చెయ్యడాలు, అమ్మడాలు, అందరికి తెలియడాలు ఎందుకు?" అన్నాడు వాడు.

"నా దగ్గర అంత లేదే" అన్నాను.

"ఎంతుంది?"

బ్యాంకులోంచి పెళ్ళి బట్టలకై డ్రా చేసిన పది వేలున్నాయి. అదే చెప్పాను. కాసేపు ఆలోచించాడు.

"సార్.. నా భార్య ఆస్పత్రిలో వుంది. డబ్బు చాలా అవసరం. అదే ఇవ్వండి మీరు చాలా అదృష్టవంతులు. పదివేలకు యాభై వేలు వస్తున్నాయి" అన్నాడు బంగారాన్ని చేతిలోపెట్టి. ఆ తరువాత అందరూ గట్టిగా నవ్వేశారు.

"మీకు వాడు బలే టోకరా ఇచ్చాడు" అంటూ.

"మీలాంటి అమాయకులు ఉండబట్టే అలాంటి మోసాలు చేసేవాళ్ళూ పుట్టుకొస్తున్నారు" అన్నాను సానుభూతిగా. బిస్కట్ల వాడి అరుపులు చూసాకే నాకు ఆకలి గుర్తుకొచ్చింది. బయట చీకటి అలుముకుంది.కంపార్టుమెంటులో లైట్లు వెలిగాయి. బిస్కెట్టు పాకెట్ కొని పక్కనున్న వాళ్ళకు కొన్ని ఇచ్చాను స్నేహపూర్వకంగా. ఎదురుగా వున్నపెద్ద మనిషికి ఇవ్వబోతే ఆయన చేతిలో పుస్తకం మడిచి సీరియస్‌గా చూసి "రైళ్ళలో ఇలా ఎవరు పెట్టినా నేను తిననండి" అన్నాడు.

అందరూ ఒక్కసారిగా ఆయనవైపు చూశారు. మాట పడ్డందుకు నా మనస్సు చివుక్కుమంది. తిరిగి ఆయనే అన్నాడు ''నా ఉద్దేశ్యం అది కాదండి. నేనెక్కువగా ప్రయాణంలోనే వుంటాను. అందు చేత మరొకరి నుండి ఆహార పదార్థాలు తీసుకోకపోవడం అలవాటుగా చేసుకున్నాను.

ఇంకా నేను తేరుకోలేదు. ఆయన ఆపలేదు. ''సారీ నా గురించి మీకు ఏం తెలియదు కదూ. ఇప్పటి వరకు మీరు మాట్లాడుకున్నారే దొంగతనాల గురించి, వాటినుండి దూరంగా ఉండాలనే ఈ ప్రయత్నం. నేను బంగారం వ్యాపారం చేసే వాడ్ని. ఎంతోవిలువైన బంగారం తీసుకురావడం, తీసుకుపోవడం నా పని. ఇప్పుడు చెప్పండి. ఆ మాత్రం జాగ్రత్త నాకు అవసరమా, కాదా''

నాకు బాధతోపాటు ఆశ్చర్యం వేసింది.

''ఆ విషయాన్ని ఇలా చెప్పడం..''

ఆయన గట్టిగా నవ్వేశాడు. ''మీ మాటలు విన్నాకా, మీమీద నమ్మకం కలిగే చెప్పాను'' అన్నాడు.

ఇప్పుడు మా అందరి మధ్య విషయం మారింది. అందరమూ ఆయనపై రకరకాల ప్రశ్నలు సంధించారు. ఆయన పుస్తకం పక్కన పెట్టి ఓపిగ్గా సమాధానాలిచ్చాడు. కొత్త నగల మీద లాభం ఎంత? పాతనగలను మార్చుకుంటే లాభం ఎంత? వినియోగదారులు ఏ ఏ విషయాల్లో తెలివిగా వుండాలి లాంటివి వివరించాడు.

''బంగారం మంచిదో కాదో ఎలా గుర్తించాలి అన్నయ్యగారు'' అంది శాస్త్రిగారి భార్య.

**''సారీ నా గురించి మీకు ఏం తెలియదు కదూ. ఇప్పటి వరకు మీరు మాట్లాడుకున్నారే దొంగతనాల గురించి, వాటి నుండి దూరంగా ఉండాలనే ఈ ప్రయత్నం. నేను బంగారం వ్యాపారం చేసేవాడ్ని. ఎంతోవిలువైన బంగారం తీసుకురావడం, తీసుకుపోవడం నా పని. ఇప్పుడు చెప్పండి. ఆ మాత్రం జాగ్రత్త నాకు అవసరమా, కాదా''**

''చాలా తేలికమ్మా. మా దగ్గర ఒక యాసిడ్ ఉంటుంది'' అంటూ పెట్టె తెరచి ఒక బాటిల్ బయటకు తీసారు.

''అవును బంగారం షాపులోచూశాను'' అన్నారు శాస్త్రిగారు.

''నిజమే. ఇది ప్రతి బంగారం షాపులోను ఉంటుంది. కానీ ఇప్పుడు నేను చూపించేది మాత్రం వేరు. దీనిలో మరికొన్ని ఇతర రసాయనాలు కూడా కలిసాయి. ఇది ఇంపోర్టెడ్‌ది. దీన్ని బంగారంపై పూస్తే, అది మంచిదయితే మెరుస్తుంది. లేకపోతే అక్కడ కరిగి పోతుంది''

దూరంగా ఉన్నవాళ్ళు కూడా దగ్గరకు వచ్చి బాటిల్ చూశారు. ఆయన బాటిల్ మూత తీసి రసాయనాన్ని కొద్దిగా దూదిపై వేసి తన చేతి ఉంగరంపై రాశాడు. రాసిన చోట తళుక్కున మెరిసింది. దూదిపై మరికొంచెం రసాయనం పోసి శాస్త్రిగారి భార్యకు ఇచ్చాడు. ఆమె పైట చాటునుంచి మంగళ సూత్రాన్ని బయటకు తీసి ఒకదానిపై రాసింది. అదికూడా మెరిసింది. ఆమె మొహంలో తృప్తి కొట్టొచ్చినట్లు కనపబడింది.

నేను చటుక్కున అడిగాను ''మీ అత్తింటి వారిపై నమ్మకం లేదా?'' అని. ఆమె సిగ్గుతో తల వంచుకుంది సమాధానంగా.

అందరూ యాసిడ్ తీసుకుని వారి దగ్గర ఆభరణాలను పరీక్షించుకున్నాడు. యాసిడ్ సువాసన కంపార్టుమెంటు అంతా గుప్పుమంది.

'' ఇది సెంటెడా?'' అన్నాను మరోసారి గుండె నిండా గాలి పీల్చి.

''మామూలు యాసిడ్‌కు దీనికి తేడా అదే. రిజల్టు కూడా వెంటనే చూపిస్తుంది'' ఆయన బాటిల్‌ను పెట్టెలో పెట్టుకున్నాడు.

వేగంగా కదులుతున్న రైల్లోకి ప్రవహిస్తోన్న చల్లటి గాలికి శరీరం అంతా మత్తుగా జోగుతోంది.

''మీల్స్ టికెట్స్–మీల్స్ టికెట్స్'' అరుస్తున్నాడు కుర్రాడు. ఆకలిగా లేదు. మీల్స్‌కు ఆర్డర్ ఇవ్వాలన్న ఆలోచన రావడం లేదు. రైలు గుంటూరులో ఆగింది. ప్లాట్‌ఫారంపై వెండర్ల అరుపులు. ఆ తరువాత విజయవాడ ఎప్పుడొచ్చిందో తెలియదు.

మాకంతా తెలిసేటప్పటికే వైజాగ్ వచ్చింది. అప్పుడు తెలిసింది ఎవరి వంటిపైనా ఏం లేదని!

★

